సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.11 వేల ప్రకారం ధర పలికింది.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.7°/14.1°

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. తెల్లవారుజామున చలి, పగలు ఎండ తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సర్వర్ సతాయింపు.. పింఛన్‌దారుల అగచాట్లు



ధర్మవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: సర్వర్ సతాయించడంతో పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచీ పలుమార్లు అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 గంటల వరకూ సర్వర్ సతాయించడంతో అటు సచివాలయ ఉద్యోగులూ, ఇటు పింఛన్‌దారులు పడరాని పాట్లు పడ్డారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి జిల్లాలోని 2,63,908 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.114.37 కోట్లు మంజూరు చేసింది. దీంతో శనివారం ఉదయమే గ్రామాలకు చేరుకున్న సచివాలయ ఉద్యోగులు పింఛన్ ఇచ్చేందుకు ప్రయత్నించగా, సర్వర్ పనిచేయలేదు. దీంతో ఉదయం 10 గంటల వరకూ వేచి చూసి ఆ తర్వాత సచివాలయాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత సర్వర్ పనిచేసినా ఇళ్ల వద్ద కాకుండా అందరినీ ఒకే చోటకు పిలిచి పంపిణీ చేశారు. దీంతో తొలిరోజు 2,51,297 మంది లబ్ధిదారులకు రూ.108.60 కోట్లు పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 12,785 మంది హాజరు

పుట్టపర్తి అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'నైతికత, మానవ విలువలు' పరీక్షకు జిల్లా నుంచి 12,785 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా నుంచి 13,134 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 349 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షను స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు సురేష్ బాబు, శ్రీరామరాజు, శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

విజయ శంకర్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు



అవార్డును అందుకున్న డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని క్రీడాలో జనవరి 29 నుంచి 31 వరకు మెట్ట వ్యవసాయ పరిశోధనలపై అంతర్జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. వివిధ దేశాల నుంచి వర్చువల్‌గా శాస్త్రవేత్తలు, 1200 మంది విభిన్న రీతిలో అభివృద్ధి సాధించిన రైతులు హాజరయ్యారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు 24 ఏళ్లుగా నేలల ఆరోగ్యం, సమగ్ర పోషణ యాజమాన్యం, తదితర మెట్ట వ్యవసాయ సంబంధిత పరిశోధనలు చేసినందుకు సదస్సులో అవార్డు అందజేశారు. ఈ అవార్డును ఐఎస్‌డీఏ ఫెలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ వారు అంతర్జాతీయ అవార్డును భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ డాక్టర్ హిమాన్షు పఠాక్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాండ్‌ఫర్డ్ బ్లెడ్ వారి చేతులు మీదుగా స్వీకరించారు. విజయ శంకర్‌బాబును ఆచార్య ఎన్జీరంగా వ్యసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది అభినందించారు.

పద్దు పొడవలేదు

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకూ కేటాయింపులు నిల్
- సెంట్రల్ వర్సిటీ అభివృద్ధికి పైసా నిధులు కేటాయించని వైనం
- వెనుకబడిన జిల్లాలో భారీ పరిశ్రమలకు కానరాని చేయూత
- వేతన జీవులకు మాత్రమే ఊరట
- కేంద్ర బడ్జెట్‌పై మేధావుల పెదవివిరుపు



అనంతపురం/ ప్రశాంతి నిలయం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లావాసులను నిరాశ పరిచింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులను ఉసూరనిపించింది. వేతన జీవులకు మాత్రమే కాస్తంత ఊరటనిచ్చి.. మిగిలిన అందరినీ ఉసూరుమనిపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని పేర్కొన్నా.. దాని ఊసే ఎత్తలేదు. ఈ ప్యాకేజీ కింద ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏటా రూ.50 కోట్ల చొప్పున 10 సంవత్సరాల నుంచి రూ.500 కోట్లు నిధులు రావాల్సి ఉన్నా... బడ్జెట్‌లో ఆ ఊసే లేదు.

రైతులకు ఏదీ ధీమా?..

బడ్జెట్‌లో మద్దతు ధరలు, రుణ మాఫీ గురించి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అసలు ప్రస్తావించనే లేదు. ఎరువుల సబ్సిడీకి నిధుల కేటాయింపులపై కూడా మాట్లాడలేదు. గతేడాదితో పోలిస్తే ప్రధానమంత్రి ఫసల్ బీమా కేటాయింపుల్లో కోత పెట్టారు. డ్రిప్, స్ప్రింకర్లు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ తగ్గించకుండా మొండిచేయి చూపారు. కిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా ఇచ్చే పంట రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారే తప్ప నేరుగా రైతులకు ప్రయోజనం చేకూర్చలేదు. దీనితోడు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి కోత పెట్టారు. రైతులకు మద్దతు ధర అంశంలో మభ్యపెట్టే రీతిలో వ్యవహరించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు చేయూతనందించే విషయంపై కనీస ప్రకటన కూడా చేయలేదు.

సెంట్రల్ వర్సిటీకి నిధుల్లేవ్..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని ఏర్పాటు చేశారు. జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్‌ను గతేడాది నుంచి నిర్వహిస్తున్నారు. 2018లో జేఎన్‌టీయూ అనంతపురంలో తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. 2023–24, 2024–2025 లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.112.08 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే, 2025–26 విద్యా సంవత్సరానికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేకంగా నిధులు మాత్రం కేటాయించలేదు. వర్సిటీలో మరికొన్ని బ్లాక్‌లు నిర్మించాల్సి ఉంది.



రోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా, అన్ని సెంట్రల్ వర్సిటీలకు సంబంధించి మొత్తం నిధులు కేటాయించారు తప్ప కొత్తగా ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపుల గురించి పేర్కొనకపోవడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే వర్సిటీ పురోగతికి మరి కొంత కాలం వేచి ఉండక తప్పని పరిస్థితి.

వేతన జీవులకు ఊరట..

మధ్య తరగతి, వేతన జీవులకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తీపి కబురు చెప్పారు. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల ఆదాయం వరకు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా రిబేట్ ప్రకటించారు. దీంతో పాటు ఆ విధానంలో శ్లాబులు మార్చారు. దీనికి మరో రూ.75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే రూ.12,75,000 వరకు పన్ను ఉండదు. ఇది చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు మంచి ఊరట అనే చెప్పవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 16,279 మంది పెన్షనర్లు, 45,300 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 5 ,700 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 11 వేల మంది అవుట్‌సోర్సింగ్, పలు ప్రైవేటు కంపెనీల్లో, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో వేలాది మంది పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వీరందరికీ ఊరట కలగనుంది.

ప్రభుత్వ రంగ సంస్థలను విస్మరించారు..



జిల్లాలో ఏర్పాటు చేసిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్ (నాసిన్) అభివృద్ధి, సేవల విస్తరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు మార్లు సందర్శించినా కేటాయింపులు మాత్రం చేయకపోవడంపై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) వంటి ప్రతిష్టాత్మక సంస్థకు భూమిపూజ చేసి ఏడేళ్లు పైగా కావస్తున్నా.. భూసేకరణ మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదు. 10 వేల మందికి ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో ఏర్పాటు కానున్న 'బెల్' స్థితిగతులపై కనీసం ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా ఉందని మేధావులు విమర్శిస్తున్నారు.

అద్భుతమైన బడ్జెట్



ఆదాయపన్ను రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం గొప్ప విషయం. దీనివల్ల ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా అవుతుంది. ఎన్నడూ లేని విధంగా మధ్య తరగతి ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ ఇది. దిగుమతి సుంకం తగ్గిస్తున్న కారణంగా టీవీ, మొబైల్స్, ఔషధాలు, ఎలక్ట్రిక్ వాహనాల ధరలు కూడా తగ్గనున్నాయి. రైతులకు రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం లభించనుంది. – చింతా శరత్‌కుమార్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా (ఆర్గానిక్) స్టేట్ కన్వీనర్

రైతులను విస్మరించారు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా రైతులకు ఉపయోగపడే అంశాలు కనిపించలేదు. పీఎం కిసాన్ నిధుల గురించి ప్రస్తావించలేదు. ఉపాధి హామీ పనులకు ఆశించిన మేరకు నిధులు కేటాయించకపోవడం దారుణం. దిగుమతి సుంకం తగ్గించడం శుభ పరిణామమే అయినప్పటికీ ధరల తగ్గదలలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పాత్ర పోషిస్తుందో చూడాలి. కేవలం వారికి అనుకూలంగా ఉండే వ్యాపారులకేనా.. ప్రజలకు కూడా లాభమా... అనేది తెలియాలి. – వేమనారాయణ, సీపీఎం నాయకుడు, పుట్టపర్తి

పైసా తేలేకపోయారు



కూటమి పార్టీల నుంచి రాష్ట్రానికి చెందిన 21 మంది ఎంపీలు ఉన్నప్పటికీ ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు తేవడంలో పూర్తిగా విఫలమయ్యారు. జిల్లాకు చెందిన ఎంపీ బడ్జెట్‌పై కనీసం నోరు కూడా విప్పకపోవడం దారుణం. బీజేపీ నాయకులు చెప్పిన వాటిని ఆమోదించడం తప్ప.. ఏమీ చేయలేని స్థితిలో జనసేన, టీడీపీ నేతలు ఉన్నట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. ఈ బడ్జెట్‌లో హిందూపురం పార్లమెంటుకు పైసా కూడా రాలేదు. రైతుల గురించి పట్టించుకోలేదు. – ఉషశ్రీచరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు

ఏపీకి నిల్.. బీహార్‌కు ఫుల్..



కేంద్రం బడ్జెట్‌లో 12 ఎంపీ సీట్లున్న బీహార్‌కు ఎక్కువ నిధులు కేటాయించారు. కూటమి పార్టీలకు ఏపీలో 21 ఎంపీ సీట్లు ఉన్నప్పటికీ నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారు. బీజేపీ పక్కా ప్రణాళికలతో అక్కడి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయింపులు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా కూటమి పార్టీల్లోని ఎంపీలు నోరు విప్పాలి. – మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ మంత్రి

ఎంతో మందికి ఊరట



ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారవేత్తలకు ఆదాయ పన్ను స్లాబు రూ.12 లక్షలకు పెంచడం చరిత్రాత్మకం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయ పన్నుల్లో మినహాయింపు ఇచ్చారు. ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాది మందికి పన్ను నుంచి మినహాయింపు లభించింది. రూ.లక్ష లోపు ఆదాయం పొందే వారికంతా పన్ను బాధ తప్పినట్లే. – రాధాకృష్ణారెడ్డి, ఆడిటర్, పుట్టపర్తి

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నాశనం

- పేదలు చదువుకోవడం చంద్రబాబుకు రుచించదు
- అందుకే ఫీజు రీయింబర్స్ నిధులు ఇవ్వడం లేదు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ''కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసింది. నిరుపేద కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియంను రద్దు చేసింది. ఎలాగోలా కష్టపడి చదువుకుందామనుకునే వారినీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా వేధిస్తోంది. నిరుపేదల కుటుంబాల్లోని విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడం సీఎం చంద్రబాబుకు నచ్చదు. అందుకే ఇబ్బందులు పెడుతూ ఆనందిస్తున్నారు'' అని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను, తల్లిదండ్రులకు వేదనకు గురి చేస్తోందన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లా కేంద్రంలో 'ఫీజు పోరు' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గతంలో దివంగత నేత వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి వర్గాల్లోని పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు బాటలు వేశారన్నారు. ఆ తర్వాత వైఎస్ జగన్ మరొక అడుగు ముందుకు వేసి విద్యారంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో నిబంధలు పక్కనపెట్టి కళాశాల ఫీజు ఎంత ఉంటే...అంతా రీయింబర్స్ చేశారన్నారు. అలాగే 'అమ్మఒడి' ద్వారా విద్యార్థి తల్లిఖాతాలో ఏటా రూ.15 వేలు జమ చేస్తూ డ్రాపౌట్‌లను తగ్గించారన్నారు. 'నాడు–నేడు' ద్వారా సర్కార్ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించారన్నారు.

జగనన్నతోనే నా ప్రయాణం

విజనరీ ఉన్న నాయకుడు, విలువలకు కట్టుబడి కష్టమైనా, నష్టమైనా ప్రజలతోనే ఉన్న నేత జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే ఆయనతోనే నా ప్రయాణం ఉంటుంది. వేరే ఏ పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదు. రాజకీయాల్లో ఉన్నంత కాలం జగనన్నతోనే ఉంటాం.

లోకేష్ కాలర్ పట్టుకుని నిలదీయాలి

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయక పోతే కాలర్ పట్టుకుని అడగాలని నారా లోకేష్ మీడియా ముఖంగా చెప్పారని, కూటమి సర్కార్ 8 నెలల్లో ఒక్కటంటే ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. అందువల్ల ప్రజలంతా నారా లోకేష్ చొక్కా పట్టుకుని హామీల అమలు ఎప్పుడని నిలదీయాలని కేతిరెడ్డి పిలుపునిచ్చారు.

అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచారని గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం పేదల సంక్షేమాన్ని విస్మరించి అభివృద్ధిని, నిధులను అమరావతికి పరిమితం చేశారన్నారు.

ప్రైవేటులోనూ రద్దు చేయండి..

ప్రభుత్వ స్కూళ్లల్లో ఇంగ్లిష్ మీడియంను రద్దు చేసిన చంద్రబాబు సర్కార్‌కు రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను రద్దు చేసే దమ్ముందా అని కేతిరెడ్డి ప్రశ్నించారు. అలాగే గత ప్రభుత్వం ఎంతో శ్రమించి తెచ్చిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు సర్కార్ నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలో ఏ పరీక్ష నిర్వహించినా నారాయణ విద్యార్థులే ర్యాంకులు దక్కించుకుంటారని, అంత విజనరీ ఉన్న నారాయణను ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేసి విద్యార్థులకు ర్యాంకులు వచ్చే విధంగా ఎందుకు కృషి చేయడం లేదని కేతిరెడ్డి కూటమి నేతలను ప్రశ్నించారు.

రేపు 'పురం' ఛైర్మన్ ఎన్నిక

- కుర్చీ కోసం టీడీపీ కుట్రలు
- వేధింపులు. ప్రలోభాలతో పార్టీ ఫిరాయింపులు
- విప్ జారీ చేసేందుకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ



హిందూపురం మున్సిపల్ కార్యాలయం

హిందూపురం: రసవత్తరంగా సాగుతున్న హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ముగింపు ఘట్టానికి చేరుకుంది. 3వ తేదీ సోమవారం ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనుండగా... ఎలాగైనా పీఠం దక్కించుకోవాలని టీడీపీ సర్వం ఒడ్డుతోంది. ఇప్పటికే పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించింది. అయితే టీడీపీకి చెక్ పెట్టేందుకు వైఎస్సార్ సీపీ అధిష్టానం కూడా సిద్ధమైంది. విప్ జారీ చేసి కౌన్సిలర్లను కట్టడి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

విప్ ధిక్కరిస్తే పదవికి చేటే..

వైఎస్సార్ సీపీ విప్ జారీ చేస్తే ఆ పార్టీ సింబల్‌పై గెలిచిన కౌన్సిలర్లంతా తప్పకుండా ఆ పార్టీ బలపరిచిన వ్యక్తికే మద్దతు తెలపాల్సి ఉంటుంది. అలాకాకుండా పార్టీ ఫిరాయించి వ్యతిరేక పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలిపితే అలాంటి సభ్యులు చట్ట ప్రకారం కౌన్సిలర్ పదవి కోల్పోవాల్సి వస్తుంది. ప్రలోభాలు, అధిపార్టీ ఒత్తిడితోనో ఓటు వేస్తే ఆ సమయంలో వారి ఓటు చెల్లుబాటు అయినా... ఆ తర్వాత వారు కౌన్సిలర్ పదవిని కోల్పోల్సివస్తుంది. 1995–96 మధ్యకాలంలో విజయనగరం మున్సిపల్ అధ్యక్ష ఎన్నిక సమయంలో ఒక సభ్యుడి ఓటు కోసం ఎన్నిక జరిగింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేయగా...అందుకు విరుద్ధంగా ఓటు వేసిన వారంతా కౌన్సిలర్ పదవులు కోల్పోయారు. పురంలోనూ కౌన్సిలర్లు గీత దాటితే అదే జరుగుతుందన్న చర్చ జరుగుతోంది.

టీ కేఫ్‌లో సంతకాలు

- కదిరి సబ్ రిజిస్ట్రార్ నిర్వాకం



టీ కేఫ్‌లో కూర్చొని సంతకాలు చేస్తున్న కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఓ టీ కేఫ్‌లో కూర్చొని రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కీలక ఫైళ్లపై సంతకాలు చేయడం దుమారం రేపుతోంది. వాస్తవానికి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ప్రస్తుతం సెలవులో ఉన్నారు. కానీ శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ కేఫ్‌లో కూర్చొని కీలక ఫైళ్లపై చకచకా సంతకాలు చేశారు. ఈ ఫైళ్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి అక్కడికి తీసుకెళ్లడం గమనార్హం. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలు పెంచిన నేపథ్యంలో అవి అమల్లోకి రావడానికి ముందు రోజు (శుక్రవారం) భారీఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్ ఈ నిర్వాకానికి ఒడిగట్టారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోనే గరిష్టంగా కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 139 రిజిస్ట్రేషన్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో భారీ మొత్తాలు చేతులు మారినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులును వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా..ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. కార్యాలయ సిబ్బందిని అడగ్గా.. సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నట్లు తెలిపారు. సెలవులో ఉన్నప్పటికీ టీ కేఫ్‌లో కూర్చొని డాక్యుమెంట్లపై సంతకాలు చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

పోలీసుల అదుపులో వీఆర్‌ఓ, సర్వేయర్

- హిందూపురంలో 'నకిలీ' కలకలం
- ఫోర్జరీ సంతకాలతో భూములకు నకిలీ పత్రాలు
- ఒక్కో సైటు రూ.2 లక్షలకు విక్రయం
- బాధిత రైతుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు





వీఆర్‌ఓ ఇంటిలో తనిఖీలు చేస్తున్న పోలీస్ అధికారులు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం అర్బన్: ఇతరుల భూములకు నకిలీ పట్టాలు తయారు చేసి భూములు విక్రయించిన ఘటన హిందూపురంలో కలకలం రేపుతోంది. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు వీఆర్‌ఓ, సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మణేసముద్రం సమీపంలో విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ గోపాలకృష్ణ మరో ఐదుగురుకి చెందిన భూములకు కొందరు నకిలీ పత్రాలు సృష్టించారు. వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చూపి ఒక్కోసైటు రూ.2 లక్షల చొప్పున 17 మందికి విక్రయించారు. ఇది జరిగి నాలుగు నెలల కాగా, ఇటీవలే సదరు భూములు కొన్న వారు తాము మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఎస్పీ మహేష్ రైతులు తమ భూములకు నకిలీ పత్రాలు సృష్టించిన వీఆర్‌ఓ రామ్మోహన్, సర్వేయర్ శ్రీనివాసులును శనివారం రాత్రి అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం వారి ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో కీలక పత్రాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. గతంలో హిందూపురం తహసీల్దార్‌గా పనిచేసిన అధికారికి వీఆర్‌ఓ రామ్మోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసులు అత్యంత సన్నిహితులుగా మెలిగినట్లు తెలుస్తోంది. వీరివద్ద భూములు కొన్న వారు కూడా ఇప్పుడిప్పుడే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. భూములకు నకిలీ పత్రాలు సృష్టించడం, వాటి ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసు పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని విలేకరులకు తెలిపారు.

చిత్రవ్యథ


కోడేకండ్ల వద్ద చిత్రావతి నది నుంచి ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లలోకి నింపుతున్న దృశ్యం

అక్రమార్కుల చెరలో చిత్రావతి నది నలిగిపోతోంది. ధనార్జనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలో ఆయా పార్టీల నాయకులు ఇసుక అక్రమ రవాణాను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. జేసీబీలు, హిటాచీలతో రాత్రింబవళ్లు ఇసుకను తోడేస్తూ టిప్పర్లతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

- చిత్రావతి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- జేసీబీలు, హిటాచీలతో రాత్రింబవళ్లు తోడేస్తున్న వైనం
- ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా కర్ణాటకకు అక్రమంగా తరలింపు
- రోజూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతలు
- ఇసుక దందా నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలం

ధర్మవరం: కూటమి పార్టీల నేతలు ఇసుకాసురులుగా అవతారమెత్తారు. ధర్మవరం నియోజకవర్గంలోని చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాలపై పాగా వేశారు. చెన్నై హైవేకు సమీపంలో గల బత్తలపల్లి మండలం రామాపురం, కోడేకండ్ల, కట్టకిందపల్లి, డీ చెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి, గంగిరెడ్డిపల్లి సరిహద్దుల్లో చిత్రావతి నది నుంచి జేసీబీలు, హిటాచీలతో రాత్రింబవళ్లు ఇసుక తోడేస్తున్నారు. ఇసుక అవసరమున్న వారు కూటమి నాయకులను ఆశ్రయించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. నియోజకవర్గంలో ప్రభుత్వం రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఇసుక కావాల్సిన వారు రీచ్‌లో డబ్బు చెల్లించి కొనాలి. తద్వారా వచ్చిన ఆదాయం ప్రభుత్వానికి వెళుతుంది. కానీ దాని వల్ల మాకేంటి ప్రయోజనం అనుకుని కూటమి నాయకులు కొత్త దందాకు తెరలేపారు. రీచ్‌లతో పని లేకుండా ఇసుకను స్వంతంగా తోడేసి డంప్ చేయడం.. విక్రయించడం.. రోజూ వచ్చిన రూ.లక్షలాది సొమ్మును తలా కొంత పంచుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. ప్రధానంగా బత్తలపల్లి మండల కేంద్రానికి ఇద్దరు టీడీపీ నాయకులు, అదే మండలం రామాపురంలో ఓ టీడీపీ నాయకుడు, కట్టకిందపల్లిలో ఓ టీడీపీనాయకుడు, డీ చెర్లోపల్లికి చెందిన ఓ బీజేపీ నాయకుడు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం.

ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు..

చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు చొప్పున విక్రయిస్తున్నారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు టిప్పర్ రూ.50 వేల చొప్పున విక్రయిస్తున్నారు. పొరుగు జిల్లాలకు అయితే టిప్పర్ ఇసుక 20 టన్నులు రూ.15 వేల నుంచి రూ.20 వేల ధరకు విక్రయిస్తున్నారు. అయితే చిత్రావతి నదిలోని ఇసుక నాణ్యత ఎక్కువగా ఉండటంతో పొరుగు రాష్ట్రాల వారు కొనేందుకు ఆసక్తి కనబరుస్తుండటంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది.

పట్టా భూముల్లోనూ తవ్వకాలు..

ధర్మవరం మండలం పోతులనాగేపల్లి, తుంపర్తి పరిధిలోని చిత్రావతి నదికి ఆనుకుని ఉన్న రైతుల పట్టా భూముల్లో సైతం కొంతమంది టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. ఈ విషయమై బాధిత రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇంతటి దౌర్జన్యకర పరిస్థితులు ఎన్నడూ చూడలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టేదీ?..

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల పోలీసులు విఫలమవుతున్నారు. కూటమి పార్టీల నాయకులు ఇందులో భాగస్వాములై ఉండటంతో చర్యలు చేపట్టకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు బత్తలపల్లి, ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్లకు ఇసుక అక్రమార్కులు భారీగా ముడుపులు ముట్టజెబుతున్నట్లుగా సమాచారం. అందుకే పోలీసులు మెతకవైఖరి అవలంబిస్తున్నట్లుగా సమాచారం.




బత్తలపల్లి మండలం జ్వాలాపురం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, నంబర్ ప్లేట్ లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

అక్రమార్కులపై ఉక్కుపాదం



ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. గ్రామసభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైన సరే ఇసుక అక్రమ రవాణా గురించి సమాచారం తెలిస్తే నేరుగా చెప్పవచ్చు.

– హేమంత్‌కుమార్, డీఎస్పీ, ధర్మవరం

క్లుప్తంగా

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

తనకల్లు: ఆర్థిక ఇబ్బందులతో ఆర్టీసీ డ్రైవర్ సూర్యనారాయణ (48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ గోపీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొక్కంటి గ్రామానికి చెందిన సూర్యనారాయణ కదిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం చేశాడు. మిగిలిన ముగ్గురు పిల్లలను చదివిస్తున్నాడు. వచ్చే జీతం పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తనలో తానే మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం గ్రామం చివర ఉన్న తిమ్మనాయుని చెరువు వద్దకు వెళ్లి చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు.

పోలీస్ వృత్తి.. సేవకు ప్రతిరూపం


ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందితో ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: పోలీసు వృత్తి సేవకు ప్రతిరూపంగా నిలుస్తుందని ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్‌ఐలు రామలింగారెడ్డి, సుబ్బరంగయ్య, ధర్మవరం టూటౌన్ ఏఎస్‌ఐ వజుతుల్లా, రామగిరి హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులును శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్‌ఐలు మహమ్మద్ వలి, మహేస్, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐ వీరన్న, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'లో రూ.19.86 లక్షల అవినీతి

మడకశిర: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో రూ. రూ.19.86 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. శనివారం మడకశిర మండల పరిషత్ కార్యాలయంలో ఏపీడీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ రకాల పనులపై సామాజిక తనిఖీ బృందం ఇటీవల విచారణ చేపట్టింది. ప్రజావేదికలో ఎంపీపీ కవితా సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, శివశంకర్ తదితరుల ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నివేదికను వెల్లడించారు. రూ.19,86,191 దుర్వినియోగమైందని, ఈ మొత్తాన్ని బాధ్యులైన టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, ఎంపీడీఓ సోనీబాయి తదితరులు పాల్గొన్నారు.

వదాన్య అశోక్‌కు 'యువ భారత్ గౌరవ్ సమ్మాన్' అవార్డు


అవార్డు అందుకుంటున్న అశోక్ పడపాటి

పుట్టపర్తి అర్బన్: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. కేఎన్ గోవిందాచార్య స్థాపించిన భారత వికాస సంఘం 7వ భారతీయ సంస్కృతీ ఉత్సవాలు కర్ణాటకలోని కలబురిగి సమీపంలోని సీడంలో వారం రోజుల పాటు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా సమాజ సేవ చేస్తున్న 51 మందిని గుర్తించి అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా వదాన్య సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటికి 'యువ భారత్ గౌరవ్ సమ్మాన్' అవార్డును ప్రధాన సమన్వయకర్త బసవరాజ్ పాటిల్, మాజీ ఎంపీ, రిటైర్డ్ మేజర్ జనరల్ ప్రమోద్ సెహగల్, వందే మాతరం ఫౌండేషన్ మాధవరెడ్డి, సీజీఆర్ అధిపతి లీలా లక్ష్మారెడ్డి తదితరులు అందజేశారు. వదాన్య ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సహాయం చేయడం, గ్రామీణుల ప్రతిభను ప్రోత్సహించడం, విద్యార్థులకు బహుమతులు అందజేయడం తదితర సేవాకార్యక్రమాలకు ఈ అవార్డు దక్కిందని అశోక్ పడపాటి పేర్కొన్నారు.

4న హాకీ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ చాంపియన్‌షిప్–2025 పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే అనంతపురం జిల్లా జట్టును ఈ నెల నాలుగో తేదీన ఎంపిక చేయనున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఎస్.అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 1996 జనవరి తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని, ఆసక్తి ఉన్న వారు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆర్డీటీ స్టేడియంలో హాజరుకావాలని కోరారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్


ఎన్‌సీసీ పరీక్షల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు


ఎన్‌సీసీ క్యాడెట్లను పరీక్షిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఆంధ్ర బెటాలియన్–6లో శిక్షణ తీసుకున్న 650 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు శనివారం హిందూపురంలోని డీవీడీబీఎస్ చిన్మయ విద్యాలయంలోని క్రీడా మైదానంలో కల్నల్ ఎంఎస్ కులకర్ణి పర్యవేక్షణలో శనివారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, డ్రిల్ టెస్ట్, తదితర అంశాలపై సుబేదార్ బంకర్ కైలాస్ సుభాష్, సుబేదార్ అజిత్ కుమార్, సుబేదార్ రాజేష్ సింగ్, హవల్దార్ జేవీఎస్ రావు పరీక్షించారు. ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుంది.

రక్షణ రంగంలో చేరుతా



రక్షణ రంగంలో చేరాలనే లక్ష్యంతో ఎన్‌సీసీలో చేరాను. ఇక్కడ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. సైనికుడికి ఇచ్చే శిక్షణను ముందస్తుగా ఇక్కడ తీసుకుంటున్నా. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే రక్షణ రంగంలో చేరే వారికి రిజర్వేషన్ కూడా ఉంటుంది. ఇది ఎంతో ఉపయోగం.

– రిత్విక, ఎన్‌సీసీ విద్యార్థి

శిక్షణతో ఎంతో మేలు



ఎన్‌సీసీ శిక్షణలో ధైర్య సాహసాలతో పాటు సామాజిక అంశాలు, క్రమశిక్షణ అలవడుతాయి. వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం, ఆత్మస్థైర్యం, క్రమ శిక్షణ, దేశభక్తి, సేవ, పరిసరాల శుభ్రతపై అవగాహన ఉంటుంది. ఎన్‌సీసీ ధ్రువపత్రాలు దేశ సేవ చేయడానికి ఎంతోగా ఉపయోగపడతాయి.

– బి.విష్ణుసహస్ర, ఎన్‌సీసీ విద్యార్థి

క్రమశిక్షణ అలవడుతోంది



ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ అలవడుతోంది. సమయపాలన, కఠోర శిక్షణ ద్వారా శారీరక దృఢత్వం పెంపొందుతుంది. ఇది ఆరోగ్యానికి ఉపకరిస్తోంది. ఎన్‌సీసీ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేసే అవకాశం లభిస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు, సంప్రదాయాలు తెలుస్తాయి.

– టి.సుకుమాంజలి, ఎన్‌సీసీ విద్యార్థి

విద్యుత్ కోతలపై రైతుల కన్నెర్ర

- శుక్రవారం రాత్రి సబ్ స్టేషన్ ముట్టడి
- శనివారం మధ్యాహ్నం వరకూ బైఠాయింపు
- వంటావార్పుతో నిరసన తెలిపిన వైనం
- హిందూపురం డీఈ భూపతి హామీతో ధర్నా విరమణ


రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న డీఈ భూపతి

రొళ్ల: కరెంటు కోతలపై రైతులు కన్నెర్ర చేశారు. వ్యవసాయనికి నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న విద్యుత్ అధికారుల తీరును నిరసిస్తూ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. దాదాపు 16 గంటల పాటు నిరసన తెలిపారు. సబ్‌స్టేషన్ వద్దే వంటవార్పు చేపట్టారు.

వందలాది మందితో ఆందోళన..

రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని హెచ్‌ఎం పల్లి ఫీడర్‌కు శుక్రవారం రాత్రి 9 గంటలకు త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేశారు. అయితే లోఓల్టేజీతో అరగంటలోపే మోటార్లు నిలిచి పోయాయి. అంతకుముందు రెండు, మూడు రోజులుగా ఇదే సమస్య తలెత్తింది. దీంతో ఆగ్రహించిన హెచ్‌ఎం పల్లి, ఆర్.వద్రహట్టి, ఆర్.గొల్లహట్టి, గొల్లహట్టితండాతో పాటు హొట్టేబెట్ట పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు రాత్రి 10 గంటల వేళ రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు భారీగా తరలివచ్చి ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు సక్రమంగా ఇవ్వనప్పుడు రొళ్ల టౌన్‌కు కూడా సింగిల్ ఫేస్ సప్లయ్ ఇవ్వకూడదని బంద్ చేయించారు. రైతులు రాత్రంతా సబ్ స్టేషన్ ఎదుటే టెంట్ వేసుకొని బైఠాయించారు. 10 రోజులుగా హెచ్‌ఎం పల్లి ఫీడర్ కింద త్రీఫేస్ విద్యుత్ రెండు గంటలు కూడా సరఫరా కావడం లేదని వాపోయారు. రబీలో బోరుబావుల కింద వేరుశనగ, రాగి, వరి, దానిమ్మ, గుమ్మడి కాయలతో పాటు మల్బరీ ఇతరాత్ర పంటలు సాగు చేశామన్నారు. లోఓల్టేజి సమస్య వల్ల పంటలకు నీళ్లు అందక ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల హామీతో ధర్నా విరమణ..

హిందూపురం విద్యుత్‌శాఖ డీఈ భూపతి, మడకశిర ఇన్‌చార్జ్ ఏడీ నాగన్నతో కలిసి శనివారం ఉదయం రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకొని రైతుల మాట్లాడారు. హెచ్‌ఎం పల్లి ఫీడర్ పరిధిలో ఇతర గ్రామాలకు సరఫరా చేసే లోడు తగ్గించి సక్రమంగా త్రీఫేస్ సరఫరాకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా త్వరలోనే ఎం.రాయాపుర, రంగనపల్లి గ్రామాల్లో కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అప్పటి వరకు మడకశిర నుంచి ఇది వరకే ఉన్న 11 కేవీఏ పాతలైన్ గుండా 15 రోజుల్లోపు రొళ్ల, రత్నగిరి మీదుగా రంగనపల్లి వరకు లైన్‌లాగి లోఓల్టేజి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఏఈ నిజాముద్దీన్, విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

- అధికారులకు, సిబ్బందికి ఖజానా శాఖ డీడీ వెంకటేశ్వర్లు సూచన


ఏటీఓలు, ఎస్టీఓలు, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీడీ

అనంతపురం అర్బన్: ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ఆయన శనివారం తన చాంబర్‌లో స్వీకరించారు. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు, జిల్లా ఖజానా శాఖ సీనియర్, జూనియర్ అకౌంటెంట్లతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. బాధ్యతలను విస్మరిస్తే మన ద్వారా ప్రజలకు అందే సేవల్లో నాణ్యత లోపిస్తుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే సహించబోనని స్పష్టం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. విమర్శలకు, ఆరోపణలకు తావివ్వకుండా సుహృద్భావ వాతావరణంలో పనిచేసి ఖజానా శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పావగడ: తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుగుడూరు మలుపులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బి.హొసహళ్ళి తండాకు చెందిన కూలీలు శుక్రవారం తిరుమణి ప్రాంతంలో సెంట్రింగ్ పనులకు వెళ్లారు. అక్కడ పనులు ముగిసిన తర్వాత రాత్రి 407 వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. బుగుడూరు మలుపులో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూలీలు తిప్పనాయక్‌తో పాటు లక్ష్మమ్మ, అరుణ, కావేరి, శాంతమ్మ, శాంతాబాయి, ప్రకాశ్, దేవిబాయి, సక్కుబాయి సహా పది మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిరుమణి సీఐ గిరీశ్ శనివారం తెలిపారు.

భార్య, అత్తపై కొడవలితో దాడి



చికిత్స పొందుతున్న లలిత, రాధమ్మ

ధర్మవరం రూరల్: భార్య, అత్తపై కొడవలితో దాడి చేసిన ఘటన శనివారం బడన్నపల్లిలో చోటు చేసుకుంది. బడన్నపల్లికి చెందిన లలితకు వేముల మండలం భూమయ్యగారిపల్లికి చెందిన బ్రహ్మచారితో వివాహమైంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. అనంతరం లలిత పుట్టింటికి వచ్చేసింది. గొడవల కారణంగా గత నెల 28న వేముల పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. అక్కడ బంధువుల సమక్షంలో పంచాయితీ జరిగింది. మూడు నెలల తర్వాత లలిత కాపురానికి వెళ్లేటట్లు తీర్మానించారు. ఆ తర్వాత నుంచి భార్య తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో ఉంచడంతో బ్రహ్మచారి కోపంతో రగిలిపోయాడు. ఈ క్రమంలో శనివారం బడన్నపల్లికి చేరుకుని భార్యపైన, అడ్డు వచ్చిన అత్త రాధమ్మపైన కొడవలితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

కేబుల్ చోరీ

శింగనమల: మండలంలోని సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది గ్రామాల్లోని 15 వ్యవసాయ బోర్లకు సంబంధించిన కేబుల్ శుక్రవారం రాత్రి చోరీ అయ్యింది. బాధితులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెలలోనూ ఇదే తరహాలో ఈ గ్రామాలకు చెందిన 20 వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ అయిన విషయం విదితమే.